క్లుప్తంగా

సిరులతల్లికి తులసిపూజ



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో రాజేంద్రకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి వాసుపల్లి వితరణ



అన్నదానానికి విరాళం అందజేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. తన కార్యాలయంలో 39వ వార్డులోని పాత పోస్టాఫీస్ కొత్తవీధికి చెందిన కేవీ గోల్డెన్ బాయ్స్ కార్యవర్గానికి అన్నదానం కోసం శనివారం రూ.5 వేలు విరాళం అందజేశారు. కేవీ గోల్డెన్ బాయ్స్ చేపడుతున్న సేవా కార్యక్రమాల గురించి తెలుసుకుని ప్రశంసించారు. కార్యక్రమంలో పార్టీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ, సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, కల్చరల్ వింగ్ సెక్రటరీ సాగర్, 39వ వార్డు అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు, కమిటీ సభ్యులు అప్పలరాజు, నూకరాజు, శివరాం, పవన్‌కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

4 వేల మందికి అన్నసమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న రమేష్, పచ్చిరపల్లి రాము తదితరులు

అల్లిపురం: గోవింద్‌రోడ్డులో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా కమిటీ సభ్యులు శనివారం అన్నసమారాధన నిర్వహించారు. గోవింద్‌రోడ్డు, నారాయణవీధి, సాయిబాబావీధి తదితర ప్రాంతాల నుంచి దాదాపు 4 వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పచ్చిరపల్లి రాము, ఆడారి వెంకట మహేష్, బూరెల చిన్న, సూరినాయుడు, కమిటీ సభ్యుడు పెదిరెడ్ల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 143ను రద్దు చేయాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న ఎంపీహెచ్‌ఏలు

బీచ్‌రోడ్డు: ప్రభుత్వం జారీ చేసిన 143 జీవో వల్ల సీనియర్ ఎంపీహెచ్‌ఏ సిబ్బందికి తీవ్రమైన అన్యాయం జరుగుతుందని, దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని ఏపీ ప్రభుత్వ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం. వెంకటలక్ష్మి కోరారు. ఈ మేరకు శనివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ జీవో ప్రకారం కేవలం 14 మంది స్టాఫ్ మాత్రమే ఉండాలన్న నిబంధనతో వేలాది మంది ఎంపీహెచ్‌ఏ సిబ్బంది ఉద్యోగ భద్రత సమస్యతో పాటు ప్రమోషన్ అవకాశాల్లో కోత పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 33 ఏళ్లుగా అదే క్యాడర్‌లో కొనసాగుతున్న సీనియర్ మహిళా హెల్త్ అసిస్టెంట్లు ఈ జీవో వల్ల సూపర్‌వైజర్ క్యాడర్‌కి మారే అవకాశం పూర్తిగా కోల్పోతారన్నారు. ప్రభుత్వం పునరాలోచించి ఆ జీవోను రద్దు చేయాలని కోరారు.

75 వసంతాల సేవా స్ఫూర్తి



సమాజం ఆధ్వర్యంలో శ్రీ రామనవమి వేడుకలు (ఫైల్)



సమాజంలో సభ్యులు (ఫైల్)



బంగారుమెట్టలో గల శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం

- ప్రత్యేకత చాటుకుంటున్న బంగారుమెట్ట శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం
- ఆధ్యాత్మిక, ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ
- సభ్యుల యోగక్షేమాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ నిర్వహణ

అల్లిపురం: ఒక ప్రాంతానికి గుర్తింపు రావాలంటే అక్కడ ఏదో ఒక ప్రత్యేకత ఉండాలి. అల్లిపురంలోని బంగారుమెట్టలో 1950లో ఏర్పాటు చేసిన శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం అటువంటిదే అని చెప్పాలి. ఆ సమాజం ఏర్పడి 75 వసంతాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా డైమండ్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు.

1950లో స్థాపితం..

బంగారుమెట్టలో 1950లో అప్పటి నవ యువకులు భీమరశెట్టి వీరినాయుడు, భీమరశెట్టి సింహాచలం, భీమరశెట్టి రాము, భీమరశెట్టి చిన్నారావు, కొణ




సమాజం, గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళ గౌరీ వ్రతం (ఫైల్)

తాల అప్పారావు, మద్దాల అప్పలస్వామి, మద్దాల పెద్ద అప్పలనాయుడు, మద్దాల వెంకునాయుడు, పీలా అప్పారావు, పిళ్లా కన్నయ్య, భీశెట్టి జగ్గారావు, పిళ్లా అప్పలనాయుడు సిమెంట్ రేకుల షెడ్డు నిర్మించి శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం నెలకొల్పారు. అప్పటి నుంచి సామాజిక కార్యక్రమాలు చేపడుతూ, సేవా కార్యక్రమాలు చేస్తూ స్థానికుల మన్ననలు పొందుతున్నారు.

దినదిన ప్రవర్ధమానమై..

సమాజం దినదిన ప్రవర్ధమానం కావటంతో సేవలు విస్తృతం అయ్యాయి. దీంతో 1975లో రిజిస్ట్రేషన్ చేసి సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. 1982లో భీశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన, కొణతాల అప్పారావు, పిళ్లా అప్పారావు, పిళ్లా వీరభద్రం స్థానికుల సహకారంతో షెడ్ తొలగించి శ్లాబ్ వేశారు. అనంతరం భీశెట్టి హనుమంతరావు, భీమరశెట్టి రమేష్, భీమరశెట్టి భగవాన్ సహకారంతో రెండవ అంతస్తు నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సమాజం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు, వినాయక చవితికి బొమ్మలు పంపిణీ చేయటం, వార్షికోత్సవానికి స్థానిక సీనియర్ సిటిజన్లు, రిటైర్డ్ ఉద్యోగస్తులకు సన్మానాలు చేస్తున్నారు. 2008లో సమాజంలో మహిళా సభ్యులతో కూడిన శ్రీ గౌరీ సేవా సంఘాన్ని చేర్చడంతో మహిళలు చురుగ్గా కార్యక్రమాలు చేపడుతున్నారు.

సమాజాభివృద్ధే లక్ష్యంగా..



మా పెద్దలు నెలకొల్పిన సమాజం అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నాం. పలు సేవా కార్యక్రమాలు, ఉచిత మెడికల్ క్యాంపులు చేపడుతున్నాం. సమాజంలో సభ్యులకు కష్టమొచ్చినా, సుఖమొచ్చినా అందరం పాలు పంచుకుంటాం. ప్రస్తుతం ఈ ఏడాది డైమండ్ జూబ్లీ జరుపుకోవడం సంతోషంగా ఉంది.

– భీశెట్టి హనుమంతరావు, అధ్యక్షుడు, శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం

అందరి సహకారంతోనే..



కార్యవర్గంతో పాటు అందరి సహకారంతో సమాజం అభివృద్ధి చెందింది. సమాజం చేపట్టే కార్యక్రమాల్లో అందరినీ భాగస్వాములను చేస్తుంటాం. శ్రీరామనవమి వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటాం. మా పెద్దలను గౌరవించే విధంగా సమాజం కార్యక్రమాలు రూపొందిస్తాం.

– భీమరశెట్టి రమేష్, కార్యదర్శి, శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం

కాపులకు ప్రాధాన్యత కల్పించాలని అభ్యర్థన



వన భోజన కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: తమకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని కాపు యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దింశెట్టి సురేష్, కార్యదర్శి ఎర్రంశెట్టి సురేష్ కోరారు. విశాఖ కాపు యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 14న కాపుల వనభోజన కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో వనభోజన కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముడసర్లోవ పార్క్ వేదికగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. కాపులందర్నీ ఒక చోట చేర్చాలని, మంచి సంకల్పంతో 2011 నుంచి ఈ కార్యక్రమం క్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆ రోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు, విందు భోజనం, ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయన్నారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించిన సింహాచలం దేవస్థానం మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ కాపులందరూ సమష్టిగా ముందుకు సాగితేనే అన్నింట తగిన ఆదరణ లభిస్తుందన్నారు.

కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ దొరబాబు, కోశాధికారి ఎస్.సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు రాము, సుహాస్, జి.శ్రీనివాసరావు, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ, ఐక్యతతో అలుపెరుగని సేవలు



సత్కారం పొందిన సిస్టర్లతో అతిథులు

కంచరపాలెం: సిస్టర్స్ ఆఫ్ సెయింట్ జోసెఫ్ ధార్మిక సంఘం ప్రారంభమై 375 వసంతాలు పూర్తయిన సందర్భంగా శనివారం సాయంత్రం సిస్టర్స్ ఆఫ్ సెయింట్ జోసెఫ్ అన్నేసి విశాఖ ప్రావిన్స్ వేడుకలు జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ కళాశాలలో నిర్వహించారు. హైదరాబాద్ ఆర్చి బిషప్ మోస్ట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పూలా అంథోనీ, బిషప్ ఎమోరిటస్ రెవరెండ్ మల్లవరపు ప్రకాష్, ఫాదర్ సురేష్‌బాబు, సిస్టర్ రోజ్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. అణగారిన వారికి సేవ చేయాలనే తమ లక్ష్యంలో భాగంగా ప్రేమ, ఐక్యత, సేవ అనే స్థిరమైన సంకల్పంతో ముందుకు సాగిన ఆరుగురు ధైర్యవంతులైన మహిళలతో పాటు వ్యవస్థాపకుడు జాన్ పియర్ మెడైల్ (జెసీ)ను ఘనంగా స్మరించుకున్నారు. విశాఖ ఆర్చి బిషప్ రెవరెండ్ ఉడుముల బాల, రెవరెండ్ ఎం.ప్రకాష్ డిడి, ఆర్చి బిషప్ ఎమోరిటస్ ఫాదర్ బవిరి సురేష్‌బాబు, రెవరెండ్ ఫాదర్ డి.బాలశౌరి, రెవరెండ్ ఫాదర్ జె.జాన్‌ప్రకాష్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హైదరాబాద్ ఆర్చి బిషప్ మోస్ట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పూలా అంథోనీ మాట్లాడుతూ ఆధ్యాత్మిక, సామాజిక రంగాల్లో నాలుగు శతాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా ప్రేమ, సేవలు అందిస్తున్న సిస్టర్లకు అభినందనీయమన్నారు. సుమారు 600 మంది సిస్టర్లను సత్కరించారు.

మానసిక వ్యాధితో బాలుడి ఆత్మహత్య

అల్లిపురం: మానసిక వ్యాధితో బాలుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం అల్లిపురానికి చెందిన విల్లూరి అర్జున ఫాల్గుణ (16) మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులు పని మీద బయటికి వెళ్లిన సమయంలో గదిలో గడియ పెట్టుకుని ఫ్యానుకు చీరతో ఉరి వేసుకున్నాడు. అతని తండ్రి విల్లూరి రమణ ఇంటికి వచ్చి తలుపులు కొట్టినా తీయక పోవటంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి తలుపులు విరగ్గొట్టి చూడగా ఫ్యానుకు చీరతో వేలాడుతూ కనిపించాడు. అతన్ని కిందకి దించేసరికే చనిపోయినట్లు గుర్తించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి తండ్రి రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జీఎస్ఐతో ఏయూ ఒప్పందం



జీఎస్ఐతో ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధన, అభివృద్ధి రంగంలో మరో ముందడుగు వేసింది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ)తో ఏయూ శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ సమక్షంలో ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఏయూ తరఫున రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. రాంబాబు, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సత్య నారాయణ మహాపాత్రో సంతకాలు చేశారు. భారత ప్రభుత్వం నుంచి వచ్చిన ఇతర ప్రతినిధులు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్ ధనుంజయ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ ఒక్కటే ఉంది

- జిల్లా అధ్యక్షురాలు గంగా భవానీ, కార్యదర్శి వరలక్ష్మి

మహారాణిపేట: ప్రభుత్వ నర్సుల సంఘానికి ఎలాంటి విభాగాలు లేవని, రాష్ట్రంలో ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ మాత్రమే ఉందని, గత ఏడాది ఎన్నికల్లో ఈ అసోసియేషన్ మాత్రమే గెలిచిందని విశాఖ జిల్లా ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు గంగాభవానీ, కార్యదర్శి జీవీఎస్ వరలక్ష్మి తెలిపారు. ఎన్నికల్లో ఓడిపోయిన కొంత మంది నాయకులు అసోసియేషన్ పేరిట పైరవీలు చేస్తున్నారని, మంత్రి వద్ద నర్సుల సమస్యల పేరిట చర్చలు జరపడం పద్ధతి కాదని శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ తరఫున 2024 అక్టోబర్‌లో ప్రభుత్వం నియమించిన అధికారుల సమక్షంలో జరిగిన ఎన్నికల్లో తాము గెలుపొందామని చెప్పారు. స్టేట్ ప్రెసిడెంట్ రాధమ్మ, జనరల్ సెక్రటరీ కోటమ్మ ఆధ్వర్యంలో 13 జిల్లాల్లో కష్టపడి గెలిచిన లీడర్ల సహాయక సహకారాలతో కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దండి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్ శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్: విశాఖ వేదికగా జరగనున్న భాగస్వామ్య సదస్సుకు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని, సంబంధించిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన 3, 5 జోన్ల పరిధిలోని నేషనల్ హైవే, తాటిచెట్లపాలెం, న్యూ కాలనీ రోడ్డు, తెలుగు తల్లి ఫ్లైఓవర్, సంపత్ వినాయక టెంపుల్ రోడ్డు, సిరిపురం జంక్షన్, పార్కు హోటల్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో రోడ్లు, ఫుట్ పాత్‌లు, అభివృద్ధి పరుస్తున్న కూడళ్లను జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో డీడీహెచ్ ఎం. దామోదరరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు గంగాధర్, శాంతిరాజ్, డీఈఈలు, ఏఈలు, వార్డు ఎమినిటీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వినతి



నిరసన తెలుపుతున్న మీ సేవ కేంద్రం ఉద్యోగులు

బీచ్‌రోడ్డు: ప్రభుత్వ అర్బన్ ఇ–సేవా కేంద్రాల్లో 18 సంవత్సరాల నుండి విధులు నిర్వర్తిస్తున్న 607 మందిని తిగిరి విధుల్లోకి తీసుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్ష నిర్వహించారు. యువగళం పాదయాత్రలో లోకేష్ మా ఇ–సేవా ఉద్యోగులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, దానిని అమలు చేయాలని కోరారు.

కార్పొరేటర్ పూర్ణిమ దాతృత్వం



మేరీ కార్మెల్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు శ్రీధర్

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి సెబాస్టియన్ కాలనీలో నివసిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త మేరీ కార్మెల్ భర్త డేవిడ్ గత వారం అనారోగ్యంతో మరణించారు. సమాచారం తెలుసుకున్న 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ కార్యకర్తలతో ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతిమ సంస్కారాలు, కుటుంబ పోషణకు రూ. 10 వేల నగదు అందించారు. జ్ఞాపకార్థ కూడికకు కావలసిన భోజన సదుపాయాలకు అయ్యే ఖర్చును భరిస్తామని భరోసా ఇచ్చి రూ.35 వేలు అందించారు. ప్రభుత్వ పెన్షన్ అందే వరకు ప్రతినెల ఇంటి అద్దె తామే భరిస్తామని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి ఆమెకు సొంత ఇల్లు వచ్చేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్‌ల దాతృత్వానికి వార్డు ప్రజలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పూర్ణిమ మాట్లాడుతూ పేదలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చామని, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బాటలోనే రానున్న రోజుల్లో ముందుకు వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, వేళంగిణిరావు, పాత్రపల్లి సునీల్‌కుమార్, కిషోర్, పరశురామ్, రాజు, మధు, ఈశ్వరి, దేవి, అన్నపూర్ణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హుద్‌హుద్ విధ్వంసానికి పదకొండేళ్లు



హుద్‌హుద్ విలయానికి రోడ్డెక్కిన పడవలు (ఫైల్)



మూలకు చేరుకున్న ఇంజిన్ (ఫైల్)

- నేటికీ మరువలేకపోతున్న నగరవాసులు



బోల్తా పడ్డ పడవ (ఫైల్)

దాబాగార్డెన్స్: హుద్‌హుద్ తుపాను సంభవించి పదకొండేళ్లయింది. 2014 అక్టోబర్ 11 అర్ధరాత్రి నుంచి 12వ తేదీ రాత్రి 7 గంటల వరకు వీచిన బలమైన ఈదురు గాలులకు విశాఖపట్నం అతలాకుతలమైంది. విశాఖ చిరునామా కరవైంది. ఒకప్పటి విశాఖతో పోల్చుకుంటే హుద్‌హుద్ తర్వాత విశాఖ మోడు వారింది. వృక్షాలు నేలకొరిగాయి.. బస్టాప్‌లు గాలికి ఎగిరిపోయాయి.. హోర్డింగ్స్ ఎక్కడెక్కడో పడ్డాయి.. మర పడవలు నీట మునిగాయి. మత్స్యసంపదకు తీవ్ర నష్టం వాటిల్లింది. విద్యుత్ వ్యవస్థ అతలాకుతలమైంది. రవాణా వ్యవస్థ స్తంభించింది. రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. విమాన వ్యవస్థ పని చేయలేదు. టీవీల్లో చూస్తున్న వారందరూ విశాఖ ఏమైందోనంటూ భయపడ్డారు. దేశ విదేశాల నుంచి వచ్చే ఫోన్లు కరువయ్యాయి. సమాచార వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. సెల్‌ఫోన్లు మూగబోయాయి. పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. హుదూద్ వచ్చి పదేళ్లయినా నగర వాసుల్లో ఆ జ్ఞాపకాలు ఇంకా మెదలుతూనే ఉన్నాయి.

ఫిషింగ్ వ్యవస్థ అస్తవ్యస్తం..

హుద్‌హుద్ తుపాన్ కారణంగా ఫిషింగ్ హార్బర్‌లో 63 మరబోట్లు పూర్తిగా నీట మునిగాయి. వందల సంఖ్యలో బోట్లు ధ్వంసమయ్యాయి. ఫైబర్ బోట్లు దెబ్బతిన్నాయి. మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లింది.


నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. రేసవానిపాలెం నుంచి సత్యం కూడలి మీదుగా తిరిగి రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం బాలికలను ఉద్దేశించి డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ బాలురు, బాలికల నిష్పత్తి సమానంగా ఉండాలన్నారు. విశాఖ జిల్లాలో ప్రతి 1000 మంది బాలురకు 969 మంది బాలికలు ఉన్నారని, ఈ నిష్పత్తి సమానంగా ఉండేలా చూడాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్టు ప్రకారం అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలు లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాలికలు అన్ని రంగాలలోను ముందున్నారని కొనియాడారు. ఐసీడీఎస్ పీడీ కె.వి.రామలక్ష్మి మాట్లాడుతూ సేవ్ గర్ల్ చైల్డ్‌ను ఉద్దేశించి లింగ వివక్ష ఉండరాదని, బాలికలు ధైర్యంగా ప్రతి విషయాన్ని ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణాధికారి (డెమో) బి.నాగేశ్వర రావు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ లూసీ, నోడల్ అధికారి ఎం.సత్యవతి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ట్రైనీ నర్సు్స్‌లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిటు మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిటు నాయకులు

దాబాగార్డెన్స్: సిటు అఖిల భారత మహాసభలు తొలిసారి విశాఖలో ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహించనున్నారు. మహాసభల పోస్టర్ శనివారం సిటు కార్యాలయంలో ఆవిష్కరించారు. మహాసభలకు దేశవ్యాప్తంగా 70 లక్షల మంది కార్మికుల సభ్యత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 1500 మంది ప్రతినిధులు 29 రాష్ట్రాల నుంచి హాజరు కానున్నారు. ఈ మహాసభలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రధానంగా చర్చించనున్నారు. భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ రూపొందించనున్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 ఏళ్ల నుంచి కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తుందని సిటు 18వ అఖిల భారత మహాసభల నిర్వహణ కమిటీ ప్రతినిధి, సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, జిల్లా కోశాధికారి జ్యోతీశ్వరరావు తెలిపారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిందన్నారు. మన రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వం 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ చట్టం చేసిందన్నారు. దీనిని కార్మిక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. సిటు ఏర్పడ్డ 55 ఏళ్ల కాలంలో తొలిసారిగా అఖిల భారత మహాసభలు వివాఖ మహానగరంలో జరుగుతున్నాయని, దీనికి ఆతిథ్యం ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిటు జిల్లా కార్యదర్శులు పి.మణి, బి.జగన్, ఉపాధ్యక్షులు కుమార్ మంగళం, ఆర్ఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను సత్వరం పరిష్కరించాలి



ఐ అండ్ పీఆర్ నూతన డైరెక్టర్ విశ్వనాథన్‌ను సన్మానిస్తున్న జర్నలిస్టుల ఫెడరేషన్ సభ్యులు

విశాఖ సిటీ: రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఐ అండ్ పీఆర్ నూతన డైరెక్టర్‌గా నియమితులైన కె.విశ్వనాథన్‌ను ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కార్యవర్గం కోరింది. శనివారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు బి.శివప్రసాద్‌లు నూతన డైరెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం జర్నలిస్టులకు సంబంధించిన పలు అంశాలను డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర పూర్తికావస్తున్నా ఇప్పటికీ జర్నలిస్టులకు నూతన అక్రిడేషన్లు మంజూరు కాలేదన్నారు. అలాగే చిన్న, మధ్యతరహా పత్రికలకు సంబంధించి తాజా జీవో ప్రకారం కొద్దిగా మార్పులు చేయాల్సి ఉందని తెలిపారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని, ఇతర రాష్ట్రాల మాదిరిగా పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. దీనిపై నూతన డైరెక్టర్ విశ్వనాథన్ సానుకూలంగా స్పందించారు. తన పరిధి మేరకు జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. సోమవారం అమరావతిలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు.